# 49

# మోసపోయిన ప్రేతం

రాజు, రాము మంచి స్నేహితులు.

ఇద్దరూ చదివేది ఒకే బడిలో.., ఒకే క్లాసులో! పైగా... ఇద్దరి ఇళ్ళూ దగ్గర దగ్గరవి కావడంతో ఎప్పుడూ కలిసే గడుపుతుండేవారు.

ఆరోజు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆ సాయంత్రం షికారుకు బయలుదేరారు. ఉషారుగా కబుర్లు చెప్పుకుంటూ పోతుంటే వారికి సమయం తెలియలేదు. దూరమూ అనిపించలేదు.

చీకటి పడుతుండేసరికి, 'మేము ఎక్కడున్నామా..?' అన్న ఆలోచన వచ్చింది.

తీరాచూస్తే - ఊరుదాటి, ఊరి చివరి స్మశానందాటి చాలాదూరం వచ్చేశారు. తిరిగి ఊళ్ళోకి వెళ్ళాలంటే స్మశానం పక్కనుంచే వెళ్ళాలి. అక్కడికి వెళ్ళేసరికి బాగా చీకటి పడ్తుంది. ఆ ఆలోచన రాగానే రాజు గుండె గతుక్కుమంది. మిత్రులిద్దరిలో రాజునే కొంచెం పిరికివాడు. రాము మంచి ధైర్యవంతుడు.

ఇద్దరూ క్షేమంగా తిరుగుముఖం పట్టారు.

రాజుకి వాళ్ళ అమ్మమ్మ చెప్పిన ఎన్నో దయ్యాల కథలు జ్ఞాపకానికి రాసాగాయి.

'వెనుకటి కాలంలో ఆ ప్రాంతంలో పరమ క్రూరుడైన 'కపాలుడు' అనే గజదొంగ ఉండేవాడట. వాడి దాడి వల్ల బాధలు పడ్డవారి సంఖ్యకి లెక్కేలేదట. చివరికి వాడు కొండతేలు కుట్టి చచ్చిపోయాడట. వాడిని ఆ స్మశానంలో పూడ్చి పెట్టారట. వాడి ప్రేతాత్మ ఆ స్మశానం దగ్గర తిరుగుతుంటుందట. వాడు ఒక తోలు చొక్కా వేసుకుని నక్కముఖంతో సంచరిస్తుంటాడట!' - ఇవన్నీ మనసులో మెదులుతుండడంతో భయపడిపోయాడు రాజు.

మిత్రులిద్దరూ స్మశానానికి బాగా దగ్గరకి వచ్చేశారు.



దూరంగా ఒక పొద దగ్గర నుంచి పైకి ఎగురుతూ ఏదో ఆకారం కనిపించింది. వణుకుతున్న కంఠంతో "అటు చూడు- అది కపాలుడి ప్రేతం!" అని రాముచెవిలో అన్నాడు రాజు.

రాముకి దయ్యాలూ, భూతాలూ, ప్రేతాలూ అంటే నమ్మకం లేదు.

"నీముఖం! ఏదో గుడ్లగూబ ఎగురుతూంటే చూసి భయపడుతున్నావు" అంటూ ఒక రాయి తీసి బలంగా ఆ ఆకారం వైపు విసిరాడు రాము.

బాధతో కుక్క అరచిన శబ్దం వినిపించింది.

మళ్ళీ మరో రాయి తీసి బలంగా ఆ ఆకారం పైకి విసిరాడు.

ఈసారి ఎవరో మనిషి - "అబ్బా..!" అని అరచిన శబ్దం వినిపించింది కాని, ఎవరూ కనిపించలేదు.

ఈసారి రాజు ధైర్యం తెచ్చుకుని మరో రాయి తీసి విసిరాడు.

ఆ ఆకారం "దఢ్!"మని చప్పుడు చేస్తూ కిందపడి పోవడం... ఆ మసక వెన్నెల్లో స్పష్టంగా కనిపించింది.

"చూశావా... ఏదో కుక్కనో, నక్కనో చూసి అనవసరంగా భయపడ్డావు" అన్నాడు రాము.

"రా... అదేమిటో చూద్దాం!" అంటూ అటు పరుగు తీసాడు రాము.

రాజు వెంబడించాడు.

ఆ పొద దగ్గర వెన్నెలలాగా తెల్లగా వున్న ఒక చొక్కా- దాని లోంచి ఒక నక్కతల బయటకి కనిపిస్తోంది. ఆ నక్క కనుగుడ్లు మండుతున్న నిప్పులలాగా మెరుస్తున్నాయి. ఆ వింత ఆకారాన్ని చూస్తూ ఆశ్చర్యపోయారు వాళ్ళిద్దరూ.

ఇంతలో ఒక కుక్క మొరుగుడు వినిపించింది.

అటుతిరిగి చూసేసరికి - దాని గొలుసును చేతిలో పట్టుకుని ఒక భయంకర ఆకారంగల వ్యక్తి రాసాగాడు. వస్తూనే - "నా మీదకు మీరెందుకు రాళ్ళేస్తున్నారు?" అని అడిగాడు.

రాజు భయంతో కొయ్యబారిపోయాడు. అతని నోటంట మాట పెగల్లేదు.

రాము ధైర్యం తెచ్చుకుని, "నక్క కనిపిస్తే దానిని తరమడానికి రాళ్ళు వేశాం. మీరెవరూ?" అని అడిగాడు.

"నేను కపాలుడిని!" అంటూ వికటాట్టహాసం చేసింది ఆ ఆకారం.

ఆ తర్వాత- "ఉండండి... నాకు చాలాకాలం తర్వాత నరమాంసం దొరుకుతోంది. మీ ఇద్దరినీ ఇప్పుడే తినేస్తాను" అంటూ నేల మీద నుంచి ఆ చొక్కా తీసి తొడుక్కున్నాడు.

దాంతో ఆ ఆకారం మరింత భీకరంగా మారింది.

'భయంతో బిగుసుకుపోయిన రాజు ఆలోచనలు పాదరసంలాగా పారాయి. ఆ చొక్కాని మనుషుల చర్మంతో చేసి, అందులో వారి ఎముకల పిండిని కూరుతాడట కపాలుడు. దానికి నక్కతల తగిలిస్తాడట. 'ఆ చొక్కాని తొడుక్కున్నప్పుడు వాడికి ఎక్కడలేని శక్తులు వస్తాయి'... అమ్మమ్మ చెప్పిన ఈ మాటలన్నీ జ్ఞాపకానికి వచ్చాయి అతనికి.

వెంటనే ధైర్యం తెచ్చుకుని, "నువ్వు మమ్మల్ని భయపెట్టాలని చూస్తున్నావు. అసలు నువ్వు కపాలుడివే కావు. కపాలుడుకి మనిషి శరీరం, కుక్కతల వుంటాయి" అన్నాడు.

"చూడు... నేనే కపాలుడుని!" అంటూ తొడుకున్న చొక్కా తీసి నేల మీద పడేశాడు కపాలుడు. వెంటవచ్చిన కుక్క అతనిలో లీనం అయిపోయింది. చూస్తుండగానే మనిషి శరీరం, కుక్క తల గల భయంకర ఆకారం ఎదుట నిలిచింది.

వెంటనే రాజు ఒక్క ఉదుటున ఆ చొక్కామీదకి దూకి దానిని రెండుగా చించివేసాడు.

ఒక ముక్కని రాముకిచ్చి, "దీన్ని తీసుకుని పారిపో!" అన్నాడు గట్టిగా.

ఆ ముక్కని తీసుకుని వేగంగా పరుగు లంకించుకున్నాడు రాము.

దానికి వ్యతిరేక దిశలో మరో ముక్కని తీసుకుని పరుగందుకున్నాడు రాజు.

ఇద్దరూ చెరో వైపునుంచి ఊరికి వచ్చాక కలుసుకున్నారు. వెంటనే మంట చేసి అందులో ఆ చొక్కాని పడవేసి తగులపెట్టారు.

ఆ చొక్కాలేనిదే కపాలుడు ఏమీ చేయలేడు. అమ్మమ్మ చెప్పిన మాటలను తెలివిగా వాడుకుని ప్రాణాలు కాపాడుకున్నారు ఇద్దరూ.

వేర్వేరు దారుల్లో పరుగెత్తారు కనుక - కపాలుడు ఎవర్నీ వెంబడించలేక ఏమీ చేయలేకపోయాడు.

"ఏమి చేయాలా..? అని ఆలోచించుకునే లోపల మనం దూరంగా వచ్చేశాం. ఇక వాడు ఎవర్నీ ఏమీ చేయలేడు" అన్నాడు రాజు.

"మనకు ఇదో గొప్ప అనుభవం! దీనివల్ల అందరికీ ప్రయోజనం కలిగింది" అన్నాడు రాము.

ఆ కపాలుడి ముచ్చట్లే మరీమరీ చెప్పుకుంటూ, సరదాగా నవ్వుకుంటూ ఇంటిదారి పట్టారు మిత్రులిద్దరూ.

★★★